

58

ధారావాహిక

# జాయ సేనాపతి

మత్తి భానుమూర్తి ...
99893 71284

చారిత్రక కాల్పనిక నవల

**జరిగిన కథ :** కాకతి సాన్నిహిత్యంలో అయ్యనప్రోలులో కొన్నిరోజులు గడిపాడు జాయప. తిరిగి రాచనగరుకు చేరుకున్నాడు. అక్కడకూడా అతనికి చాలామంది మిత్రులయ్యారు. వారంతా యుద్ధ విశారదులు.. రాజ్య వ్యవహారాలలో మంచి నిపుణులు. కానీ, వారెవరూ చతుష్పథం మిత్రుల్లా జాయప మనసులోకి రాలేకపోతున్నారు. వాళ్ల నుంచి ఉత్తేజితం కావడం.. వారినుంచి ఏదో ఒకటి నేర్చుకోవడం చేయలేకపోతున్నాడు జాయపుడు.

రాత్రివేళ రాజనగరు చాలా మౌనంగా ఉంటుంది.

అనుమకొండలో సుబుద్ధి నివాసంలో ఉన్నప్పుడు.. అర్ధరాత్రి కూడా ఎక్కడో కుక్క అరుపో.. గుర్రం సకిలింపో.. ఏనుగు ఘీంకారమో.. కీచురాళ్ల ధ్వనో.. ఏదో ఓ రణగొణ ధ్వని వినిపిస్తూ సందడిగా ఉండేది.

'ఇక్కడ మరీ ఇంత నిశ్శబ్దం ఏమిటో!?'.. అనుకునేవాడు జాయపుడు.

కానీ, ఆరోజు హఠాత్తుగా ఆ నిశ్శబ్ద నిశీధిలో ఏదో సంగీత రాగాలాపన! ఎవరో స్త్రీ .. ఆలాపన చేస్తున్నది. ఆ నిశ్శబ్దంలో ఆ రాగాలాపన మృదుమధురంగా వినిపిస్తున్నది.

మెత్తగా మొదలై, శ్రావ్యంగా.. తీయగా.. వింటున్న కొద్దీ మరీ రమ్యంగా.. మరీ మరీ వినబుద్ధేస్తున్నట్లు.. దగ్గరికి లాక్కుంటున్నట్లు! విస్మయావిష్టుడై బయటికి వచ్చాడు. ఎటునుంచి? ఎవరు??

కాకతీయ కోట లోపల చివరగా ఉండే రాజనగరి అనేది ఓ పెద్ద నగరమంత విశాలమైనది. ఎన్నో భవనాలు, వాటి మధ్య విశాలమైన వీధులు.. మధ్యమధ్య సన్నని డొంకలు..

రాజనగరి భవనాల మధ్య రెండు వీధులు దాటాక ఓ డొంక.. నిశ్శబ్దంగా ఉంది. అక్కడక్కడా వెలుగుతున్న ఆముదపు దీపాలు మగతగా ఆ సంగీతాన్ని ఆస్వాదిస్తున్నట్లు కదలాడుతున్నాయి. దూరంగా డొంకమలుపు వద్ద చలిమంటలా వెలుగు.. చుట్టూ నలుగురైదుగురు గొంగళ్లు కప్పుకొని కూర్చున్నారు. కాపలా భటులు కాబోలు.. ఎండు పసరిక ఆకు చుట్టి పొగ తాగుతూ ముచ్చట్లు చెప్పుకొంటున్నారు.

వారికి ఆ రాగాలాపన వినిపిస్తున్నట్లు లేదు. వారి ముచ్చట్లలో వారున్నారు. ఆ సంగీత రాగం వింటూ డొంక వెంట ముందుకు పోతున్నాడు. మలుపువద్ద ఆగి వింటే.. గానం కుడివైపు నుంచి వస్తున్నది. కాపలా భటుల చలిమంట ఎడంవైపున ఉన్నది. కుడివైపుగా తిరిగాడు. మరి నాలుగు అడుగులు వేస్తే.. ఆ గానం మరింత దగ్గరవుతున్నది.

వింటూ.. నడుస్తూ చటుక్కున ఆగిపోయాడు.

ఎదురుగా ఓ భవనపు మొదటి అంతర్వుపై కాగడా వెలుగులో ఓ మహిళ కదులుతూ రాగం ఆలపిస్తున్నది. ఆమె నోటి కదలిక కంటే చేతుల రాగయుక్తపు కదలిక తెలుస్తున్నది.

ఆ చీకటిలో ఆమె గానం మధురంగా ప్రకృతిలో కలగలుస్తున్నది. పైన అభినందనల వెన్నెలలు కురిపిస్తున్న అర్ధ చందమామ.. చప్పట్లు చరుస్తున్న ప్రేక్షకుల్లా నక్షత్రాలు మిణుకు మిణుకుమంటున్నాయి. ఆమె ప్రకృతికే తన గానాన్ని వినిపిస్తున్నట్లు అనిపించింది జాయపునికి.

అతను తలెత్తి నందికేశ్వరునిలా ఆమెనే చూస్తున్నాడు. ఆ ప్రాకృతిక చీకటి.. కాగడా వెలుగు మధ్య మొదటి